క్లుప్తంగా

వైభవంగా శ్రీవారి నక్షత్ర కల్యాణం

రాయవరం: స్థానిక శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి నక్షత్ర కళ్యాణాన్ని మంగళవారం నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి జన్మ నక్షత్రమైన శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని వేద పండితులు స్వామి వారి దివ్య కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. సుమారు 200 మంది దంపతులు, అధిక సంఖ్యలో భక్తులు కల్యాణంలో పాల్గొన్నారు.

అంబేడ్కర్, జగ్జీవన్ విగ్రహాల ఏర్పాటుకు వినతి

మండపేట: పట్టణంలోని ప్రధాన కూడలిలో రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్, మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాల ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని నియోజకవర్గంలోని దళిత నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ సమావేశంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణిలకు వినతి పత్రాలు అందజేశారు. వీరి విగ్రహాలను మండపేట మెయిన్ సెంటర్‌లో ఏర్పాటుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఎస్సీ ఎస్టీ సర్పంచుల సమాఖ్య కో -కన్వీనర్ బూరిగ ఆశీర్వాదం, దళిత నాయకులు పాల్గొన్నారు.

ఉచిత బస్ పాస్‌ల అందజేత

కపిలేశ్వరపురం: అంగర జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు మంగళవారం ఆర్టీసీ ప్రతినిధులు బస్ పాస్‌లు అందజేశారు. వీటిని హెచ్‌ఎం అంగర రాజు, సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు మేడిశెట్టి దుర్గారావు, వైఎస్సార్ సీపీ నాయకుల చేతుల మీదుగా అందించారు.

మంత్రికి పార్టీ జిల్లా కార్యదర్శి కృతజ్ఞతలు

కె.గంగవరం: మండలంలోని యండగండికి చెందిన సాదే నారాయణరావు ఇటీవల వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో ఆయన రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణను రామచంద్రపురంలోని పార్టీ కార్యాలయం వద్ద మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి, కృతజ్ఞతలు తెలిపారు. మంత్రిని సత్కరించారు.

కౌలు వ్యవసాయ నిపుణులకు రుణాలు

కపిలేశ్వరపురం: రాష్ట్రంలో కౌలు రైతుల ప్రయోజనాల కోసం ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండలంలోని టేకి ఆర్బీకేలో మంగళవారం కౌలు వ్యవసాయ నిపుణులకు మంజూరైన రుణాలను లబ్ధిదారులకు ఎమ్మెల్సీ తోట, ఆలమూరు వ్యవసాయ సహాయ సంచాలకులు కాకి నాగేశ్వరరావు చేతుల మీదుగా అందజేశారు. సర్పంచ్ కుక్కల నాగమణి, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాస్, మండల సాగు సలహా మండలి చైర్మన్ పుట్టా కృష్ణమూర్తి, తహసీల్దార్ కొమరం సూర్యారావు పాల్గొన్నారు. నియోజకవర్గంలో 246 మంది కౌలు నిపుణులకు రూ.1.29 కోట్లు రుణాలను మంజూరు చేసిందన్నారు. ఏవో రమేష్‌కుమార్ కూడా పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుకు క్రీడలు దోహదం



అవార్డు అందుకుంటున్న హెచ్‌ఎం సుశీలామణి, పీడీ సునీల్‌కుమార్, విద్యార్థులు

కాజులూరు: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు క్రీడలు ఎంతో దోహదపడతాయని గొల్లపాలెం హైస్కూల్ హెచ్‌ఎం ఎస్ఎస్‌బీ సుశీలామణి అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. జిల్లాలో క్రీడల్లో రాణిస్తున్న ఐదు పాఠశాలలను ప్రభుత్వం 2022-23 విద్యా సంవత్సరానికి ఎంపిక చేసి, స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సీ, క్రీడా ప్రతిభా పురస్కారాలు ప్రకటించింది. దీనిలో కాకినాడ జిల్లా ద్వితీయ స్థానాన్ని గొల్లపాలెం హైస్కూల్ సాధించింది. ఈ సందర్భంగా కాకినాడలోని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో జరిగిన జాతీయ క్రీడా దినోత్సవంలో పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీ నాగమణి, కాకినాడ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి చేతుల మీదుగా హెచ్‌ఎం సుశీలామణి, పీడీ సునీల్ కుమార్, విద్యార్థులు అవార్డు అందుకున్నారు. అనంతరం పాఠశాలలో జరిగిన సభలో సుశీలామణి మాట్లాడుతూ, సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, అథ్లెటిక్స్, వాలీబాల్, రైఫిల్ షూటింగ్, స్విమ్మింగ్ పోటీల్లో 19 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో రాణించి, తమ పాఠశాలకు ఈ అవార్డు సాధించారని చెప్పారు. విజేతలను పలువురు ప్రముఖులు అభినందించారు.

ప్లాస్టిక్‌పై నిషేధం విధించాలి

రామచంద్రపురం రూరల్: ప్లాస్టిక్ కవర్ల వినియోగంపై నిషేధం విధించాలని, వీటిని విక్రయించే షాపులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ కన్స్యూమర్స్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జిల్లా అధ్యక్షుడు డి.అభిరామ్ కోరారు. ఈ మేరకు ఎంపీడీఓ ఎస్.షెలత్‌రాజుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. దీనిపై ఎంపీడీఓ సానుకూలంగా స్పందించారని తెలిపారు.

కోలమూరిని పదవి నుంచి తొలగించండి

- తీర్మానానికి కౌన్సిల్‌లో పట్టుబట్టిన మహిళా కౌన్సిలర్లు
- వారించిన మంత్రి వేణు
- క్షమాపణ చెప్పిన వైస్ చైర్మన్ శివాజీ



కౌన్సిల్ సమావేశంలో మంత్రి వేణు, చైర్ పర్సన్ శ్రీదేవి

రామచంద్రపురం: ప్రతి విషయంలో అభివృద్ధికి అడ్డం పడుతున్నారని, తమ మనోభావాలు దెబ్బతినేలా వైస్ చైర్మన్ కోలమూరి శివాజీ కౌన్సిల్ సమావేశంలో వ్యవహరిస్తున్నారని, ఆయనను పదవి నుంచి తొలగించాలని, ఈ మేరకు తమ తీర్మానానికి ఆమోదం తెలపాలని మున్సిపల్ కౌన్సిల్‌లో మహిళా కౌన్సిలర్లు చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవిని పట్టుబట్టారు. శ్రీదేవి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం మంగళవారం జరిగింది. ఇందులో ఎక్స్ అఫీషియో సభ్యుని హోదాలో రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పాల్గొన్నారు. తొలుత 12 అంశాలతో కూడిన అజెండాను మున్సిపల్ అధికారులు ప్రవేశపెట్టారు. సభను ప్రారంభిస్తున్నట్టు చైర్‌పర్సన్ శ్రీదేవి ప్రకటించిన వెంటనే వైస్ చైర్మన్ కోలమూరి శివాజీ మాట్లాడుతూ.. కౌన్సిల్ సమావేశం లోపలకు ఇతరులు వచ్చారని, వారిని బయటకు పంపాలని కోరారు. దీనిపై స్పందించిన మహిళా కౌన్సిలర్లు తమ భర్తలు తమకు తోడుగా వచ్చారని, గ్యాలరీలో మాత్రమే కూర్చున్నారని, ఈ మేరకు ఇదివరకే చైర్‌పర్సన్ అనుమతి కోరామని చెప్పారు. దీనికి అనుమతి ఇస్తున్నామని శ్రీదేవి చెప్పారు.

స్టాండింగ్ కౌన్సిల్‌గా సత్యవాణికి ఆమోదం

అజెండాలోని 12 అంశాలకు సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఏడో అంశంగా మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ కోసం ముగ్గురి పేర్లను స్థానిక బార్ కౌన్సిల్ అందజేసిందని సభకు తెలిపారు. వీరిలో కావూరి వెంకట సత్యవాణిని మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా కౌన్సిలర్ పెంటపాటి దేవి ప్రతిపాదించి, ఆమోదం తెలపాల్సిందిగా సభ్యులను కోరారు. జనసేన కౌన్సిలర్ అంకం శ్రీను మాట్లాడుతూ, సత్యవాణికి మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించగా మిగిలిన సభ్యులు కూడా ఆమోదం తెలిపారు.

అనంతరం కౌన్సిలర్ కేతా సుజాత మాట్లాడుతూ, ప్రతి సమావేశంలోనూ తమ మనోభావాలు దెబ్బతినేలా వైస్ చైర్మన్ కోలమూరి శివాజీ వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా కౌన్సిలర్ల భర్తలు గ్యాలరీలో కూర్చుంటే వెళ్లిపోవాలని కోరడం తమను బాధ పెట్టిందని, ఆయనపై అవిశ్వాసం పెట్టాలని ప్రతిపాదించారు. దీనికి మిగిలిన మహిళా కౌన్సిలర్లు లేచి నిలుచుని మద్దతు తెలుపుతూ, అవిశ్వాసం పెట్టేందుకు ఆమోదించాలని చైర్‌పర్సన్ శ్రీదేవిని కోరారు. ఈ పరిస్థితుల్లో మంత్రి వేణు స్పందించారు. శివాజీపై అవిశ్వాసం తగదని, ఆయన కూడా తోటి సభ్యుడేనని, కానీ ఎవరో కొంత మంది ప్రోద్బలంతో ఆయన వ్యవహరిస్తున్న తీరు సరి కాదని అన్నారు. వైస్ చైర్మన్‌గా బాధ్యతాయుతమైన పదవిని సభ్యులు ఇచ్చారని, వారి మనోభావాలు దెబ్బ తినకుండా ప్రవర్తించాలని శివాజీకి సూచించారు. ఈసారికి తీర్మానాన్ని వెనక్కు తీసుకోవాలని మంత్రి విజ్ఞప్తి చేయగా మహిళా కౌన్సిలర్లు అంగీకారం తెలిపారు. అనంతరం వైస్ చైర్మన్ శివాజీ మాట్లాడుతూ, తాను మున్సిపాలిటీ అభివృద్ధి కోసమే సమావేశంలో మాట్లాడుతున్నానని, తన వ్యవహార శైలి, మాట్లాడిన మాటలు బాధించినట్లయితే క్షమించాలని కోరారు. దీంతో సమస్య సద్దుమణిగింది.

అవినీతికి తావులేని అభివృద్ధికి సహకరించండి

పట్టణ ప్రగతిని అడ్డుకునేందుకు కొంత మంది ఆటంకాలు సృష్టిస్తున్నారని, వాటిని అధిగమించి అవినీతి లేని అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని మంత్రి వేణు సూచించారు. త్వరలోనే ప్రధాన రహదారికి మరోపక్కనున్న డ్రైనేజీలో పూడికతీత పనులు ప్రారంభమవుతాయన్నారు. పట్టణానికి ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్‌టీపీ) కోసం స్థల సేకరణ జరుగుతుందన్నారు. దీని కోసం గతంలోనే రూ.10 కోట్లు మంజూరు కాగా, స్థల సేకరణకు కొంత మంది అడ్డం తగిలారన్నారు. వాటిని అధిగమించి ప్లాంట్ నిర్మాణానికి కృషి చేస్తున్నామని చెప్పారు. పట్టణంలో పార్కులను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు నిధులు మంజూరు చేస్తున్నామని మంత్రి తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి, వైస్ చైర్మన్ చింతపల్లి నాగేశ్వరరావు, కౌన్సిలర్లు వాడ్రేవు సాయిప్రసాద్, కేతా శ్రీను, పోతంశెట్టి వెంకట శ్యామలత, కుడుపూడి లలిత, పాలపర్తి శ్వేతపావని, బావాల మంగామణి, మేడిశెట్టి కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా సత్యవాణి



మంత్రి వేణుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్న సత్యవాణి

రామచంద్రపురం: మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా సీనియర్ న్యాయవాది కేవీ సత్యవాణి నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఈ పదవిలో సత్యవాణి మూడేళ్లు కొనసాగుతారు.

ఈ మేరకు రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, మున్సిపల్ కౌన్సిలర్లను సత్యవాణి కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ఇంటింటా సంక్షేమ కాంతులు

- మంత్రి చెల్లుబోయిన వేణు
- పల్లిపాలెంలో గడప గడపకూ మన ప్రభుత్వం



స్థానికులకు ప్రభుత్వ లబ్ధిని వివరిస్తున్న మంత్రి వేణు

కాజులూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో గడప గడపనా సంక్షేమ కాంతులు విరజిమ్ముతున్నాయని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. పల్లిపాలెంలో నాలుగో రోజైన మంగళవారం కూడా ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వలంటీర్లు, కార్యకర్తలతో ఇంటింటికీ వెళ్లి ప్రతి ఒక్కరినీ పలకరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయో లేదో ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా, అర్హులందరికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత పారదర్శకంగా, ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా నేరుగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని అన్నారు. గతంలో ఏ చిన్న పనికైనా ప్రజలు జిల్లా, మండల కేంద్రాలకు వెళ్లి.. రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని గుర్తు చేశారు. దీనికి భిన్నంగా సీఎం జగన్ గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి అన్ని శాఖల అధికారులను గ్రామ స్థాయిలోనే అందుబాటులో ఉంచారని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో అరకొరగా అమలయ్యే పథకాలు సైతం జన్మభూమి కమిటీ సిఫారసుల మేరకు టీడీపీ కార్యకర్తలకే ఇచ్చేవారని, సామాన్యులకు న్యాయం జరగాలంటే దళారుల చుట్టూ తిరగాల్సి వచ్చేదని గుర్తు చేశారు. ప్రభుత్వం నుంచి జరగాల్సిన ప్రతి పనినీ వలంటీర్ల ద్వారా సచివాలయ ఉద్యోగులే ప్రజల వద్దకు వచ్చి పూర్తి చేస్తున్నారని అన్నారు. అవ్వాతాతలకు, వికలాంగులకు వలంటీర్ల ద్వారా పింఛన్లు, రేషన్ బియ్యం నేరుగా వారి ఇళ్ల వద్దనే అందిస్తున్నారని చెప్పారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా విత్తనం నుంచి విక్రయం వరకూ రైతులకు అన్ని సదుపాయాలూ కల్పిస్తున్నారని మంత్రి వేణు చెప్పారు. కార్యక్రమంలో మంత్రి తనయుడు నరేన్, ఎంపీపీ మాత భారతి, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు వనుం వెంకట సుబ్బారావు, మేడిశెట్టి శ్రీను, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, స్థానిక అధికారులు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు త్వరలో టిడ్కో ప్లాట్ల పంపిణీ

- పనుల వేగవంతానికి కృషి
- కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్సీ తోట
- మాస్టర్ ప్లాన్‌పై చర్చ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు. చిత్రంలో ఎమ్మెల్యే వేగుళ్ల



చైర్ పర్సన్ దుర్గారాణి

మండపేట: మౌలిక వసతుల పనులు పూర్తి చేసి త్వరలోనే లబ్ధిదారులు అందరికీ టిడ్కో ప్లాట్ల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తెలిపారు. మండపేట మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్ పర్సన్ పతివాడ దుర్గారాణి అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఎమ్మెల్సీ తోట, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడుతూ మిగిలిన లబ్ధిదారులకు టిడ్కో ప్లాట్లు ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ తొలి విడతలో రెండు వేల మందికి ప్లాట్లు స్వాధీనం చేయగా, కేవలం 300 మంది మాత్రమే ప్లాట్లలోకి వచ్చారన్నారు. నివాసయోగ్యంగా వారికి అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించామన్నారు. దుస్తులు ఉతుక్కునేందుకు అపార్ట్‌మెంట్ల వద్ద బోర్లు ఏర్పాటు చేసి చుట్టూ దిమ్మలు నిర్మించనున్నట్టు చెప్పారు. మిగిలిన ప్లాట్ల వద్ద మౌలిక వసతుల కల్పన పనులు జరుగుతున్నాయన్నారు. త్వరలోనే లబ్ధిదారులు అందరికి ప్లాట్లు అప్పగించేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని ఎమ్మెల్సీ తోట తెలిపారు. మాస్టర్ ప్లాన్ అమలులో జాప్యం ఎందుకు జరుగుతోందని ఎమ్మెల్యే వేగుళ్ల అధికారులను ప్రశ్నించారు. లే అవుట్లు వేయడానికి భూ యజమానులు పొలం ఇవ్వకపోతే ఇళ్ల స్థలాల కోసం స్థల సేకరణ చేస్తామని బెదిరించి తీసుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయన్నారు. దీనిపై ఎమ్మెల్సీ తోట స్పందిస్తూ మాస్టర్ ప్లాన్ అమలులోకి రానప్పుడు ప్రజలను ఏ విధంగా భయపెడతారని ప్రశ్నించారు. ప్రభుత్వంపై బురద జల్లేందుకు కావాలని దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు, పట్టణంలోని భూముల ధరలకు పొంతన లేదన్నారు. మండపేట ప్రాంతంలో ఎకరం సుమారు రూ.రెండు కోట్ల వరకు ఉండటంతో ఇళ్ల స్థలాల కోసం స్థల సేకరణ సాధ్యం కాదని ఆ ప్రయత్నాన్ని విరమించినట్టు చెప్పారు. రెవెన్యూ బోదులు సైతం ఆక్రమించి లే అవుట్లు వేసిన సంస్కృతి ఇక్కడ ఉందని ఎమ్మెల్సీ తోట విమర్శించారు.

బలవంతంగా స్థలాలు తీసుకోం

కమిషనర్ టి. రామ్‌కుమార్ మాట్లాడుతూ గతంలో ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా మాస్టర్ ప్లాన్ ప్రెజెంటేషన్ చేశామని డ్రాఫ్ట్ పబ్లికేషన్ జరిగిన తరువాత అభ్యంతరాలు తెలియజేయవచ్చన్నారు. త్వరితగతిన మార్పులు చేసి పంపించాలని ఏజెన్సీని కోరినట్లు తెలిపారు. మాస్టర్ ప్లానులో మార్కు చేసినంత మాత్రాన యజమాని నుంచి బలవంతంగా స్థలం తీసుకోవడం జరగదని స్పష్టం చేశారు. కావాలంటే యజమాని ఆ స్థలాన్ని విక్రయించుకోవచ్చునని కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులు వివరించారు. పట్టణాభివృద్ధికి సంబంధించి అజెండాలో పేర్కొన్న ఆయా అంశాలను సభ్యులు ఆమోదించారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి, కో ఆప్షన్ సభ్యుడు రెడ్డి రాజుబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, వేగుళ్ల నారయ్య, విప్ పోతంశెట్టి ప్రసాద్, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి చూసి ఓర్వలేకే అసత్య ఆరోపణలు

- ఎమ్మెల్యే వేగుళ్లపై రైతుల మండిపాటు
- తమ సమక్షంలో పుంత రోడ్లు అభివృద్ధి చెందాయని స్పష్టీకరణ



గ్రావెల్ ట్రిప్పులకు సంబంధించి ట్రిప్ షీట్ పుస్తకాలు చూపిస్తున్న రైతులు

మండపేట: ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు కృషితో పుంత రోడ్లు అభివృద్ధి చెందడం చూసి ఓర్వలేకనే ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అసత్య ఆరోపణలు చేస్తున్నారని రైతులు విమర్శించారు. అక్రమాలకు తావు లేకుండా రైతుల సమక్షంలోనే పుంత రోడ్ల అభివృద్ధి పనులు జరిగాయని వారు స్పష్టం చేశారు. పుంత రోడ్లు అభివృద్ధి పేరిట ద్వారపూడి, కేశవరం గ్రామాల్లో అక్రమ మైనింగ్ జరుగుతున్నా చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని సోమవారం స్పందనలో ఎమ్మెల్యే వేగుళ్ల అధికారులకు ఫిర్యాదు చేయడాన్ని వారు ఖండించారు. జెడ్. మేడపాడు, కేశవరం, ద్వారపూడి గ్రామాల రైతులు మంగళవారం సాయంత్రం కేశవరం పుంత రోడ్డు వద్ద ఎమ్మెల్యే వేగుళ్ల తీరుపై నిరసన తెలిపారు. ఆయా గ్రామాలకు చెందిన రైతులు కొప్పిరెడ్డి సత్యనారాయణ, పిడుగు వెంకటేశ్వరరావు, యార్లగడ్డ దైవసహాయం, గంధం పెదకాపు, సలాది శివన్నారాయణ, సంగిశెట్టి సత్తిబాబు, అన్నందేవుల పెద్ద తదితరులు మాట్లాడారు. మూడు దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోక అధ్వానంగా తయారైన ఈ రోడ్లకు జడిసి మధ్యాహ్నం క్యారేజీ తెచ్చుకోవడానికి చేలోంచి ఇంటికి వెళ్లే వాళ్లం కాదని, పొలంలోకి ఎరువుల బస్తా తేవాలన్నా, పండిన ధాన్యాన్ని తరలించాలన్నా నానా తంటాలు పడేవాళ్లమని వివరించారు. ఎమ్మెల్సీ తోట కృషితో సైకిల్ కూడా రాని తమ పుంత రోడ్లపైకి ఇప్పుడు కార్లు కూడా తిరిగేలా అభివృద్ధి చెందాయన్నారు. మూడు గ్రామాల పరిధిలో సుమారు 16 కిలోమీటర్ల మేర పుంత రోడ్లను నాయకులు, రైతులు కలిసి గ్రావెల్ రోడ్లుగా ఎమ్మెల్సీ తోట అభివృద్ధి చేశారన్నారు. ఎమ్మెల్యే వేగుళ్ల గతంలో అధికారం అడ్డం పెట్టుకుని కేశవరం, ద్వారపూడి చెరువుల్లో మట్టిని అక్రమ తరలించుకుపోయి తన లే అవుట్లు కప్పేట్టుకున్నారే తప్ప రైతులకు గుప్పెడు మట్టి ఇవ్వలేదని మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, సొసైటీ చైర్మన్ ముక్కపాటి శ్రీనివాస్, ఆర్‌బీకే మండల కమిటీ చైర్మన్ అన్నందేవుల చంద్రరావు, జెడ్.మేడపాడు గ్రామ కమిటీ అధ్యక్షుడు తోరం శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ నాయకులు అద్దంకి రమణ, సమతం పాపారావు, తుపాకుల ప్రసన్నకుమార్, బందెల సాయిరాం, అబ్బిరెడ్డి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమానికి చిరునామా జగన్ ప్రభుత్వం

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- చెల్లూరులో గడప గడపకూ..



చెల్లూరులో మహిళకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు

రాయవరం: జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం సంక్షేమానికి చిరునామాగా నిలిచిందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండలంలోని చెల్లూరు గ్రామంలో మంగళవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ పాలిక రాఘవ, సొసైటీ చైర్మన్ చిక్కాల శ్రీరాములు, మండపేట ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు ఆరిఫ్ తదితరులతో కలిసి ఎమ్మెల్సీ త్రిమూర్తులు గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రజా సాధికారితే లక్ష్యంగా సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమానికి పాటుపడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఎమ్మెల్సీ గడపగడపకూ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, ప్రజలు పొందుతున్న లబ్ధితో కూడిన కరపత్రాలను ఆయన ప్రజలకు అందజేశారు. త్రిమూర్తులకు ప్రజలు అడుగడుగునా పూలమాలలు, హారతులతో స్వాగతించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల సేవాదళ్ అధ్యక్షుడు వెలగల సత్యనారాయణరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ తమలంపూడి సత్యనారాయణరెడ్డి, పార్టీ నేతలు పాలిక గోవిందు, పిల్లి సుబ్రహ్మణ్యం, కోటి అంబేడ్కర్, వివిధ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

తెలుగు.. జీవన వెలుగు



కె.గంగవరం ఉన్నత పాఠశాలలో పలు వేషధారణలతో అలరిస్తున్న విద్యార్థులు



నరసాపురపుపేట జెడ్పీ హైస్కూల్‌లో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు

- ఘనంగా తెలుగు భాషా దినోత్సవం
- మాతృభాష ప్రాధాన్యాన్ని వివరించిన ఉపాధ్యాయులు

రామచంద్రపురం: మరణించే వరకూ తెలుగు కోసం శ్రమించిన ఘనత గిడుగు వెంకట రామమూర్తిదని రాజమహేంద్రవరం ప్రభుత్వ అటానమస్ కళాశాల తెలుగు అధ్యాపకురాలు షేక్ జరీనా బేగం అన్నారు. స్థానిక వీఎస్‌ఎం అటానమస్ కళాశాలలో మంగళవారం జరిగిన తెలుగు భాషా దినోత్సవంలో ఆమె వక్తగా పాల్గొన్నారు. గిడుగు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సవర భాష లిపి కోసం కృషి ఆ ప్రాంత వాసులకు బతుకు జ్ఞానాన్ని గిడుగు అందించారని చెప్పారు. అతిథిగా పాల్గొన్న కళాశాల వైస్ ప్రెసిడెంట్ ఎంఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ, తెలుగు భాష కోసం కృషి చేసిన గిడుగు చిరస్మరణీయులని అన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎస్ అలీ అన్సారీ మాట్లాడుతూ, దేశంలో నాలుగో స్థానం పొందిన భాష తెలుగు అని చెప్పారు. తెలుగు శాఖాధిపతి డాక్టర్ ర్యాలి శ్రీనివాస్ కూడా ప్రసంగించారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. తెలుగు అధ్యాపకురాలు ఎంకే లక్ష్మి వక్తగా జరిగిన సమావేశంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

వివిధ పాఠశాలల్లో..

రామచంద్రపురం రూరల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం గుణ్ణం రాజేశ్వరి ఆధ్వర్యాన తెలుగు ఉపాధ్యాయులు కూచిభొట్ల జనార్దనస్వామి, కె.సునీత, అఫ్సానా, కిరణకుమారిలు విద్యార్థులను తెలుగు కవుల వేషధారణల్లో తయారు చేసి, వారు మాతృభాషకు అందించిన సేవలను విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించారు. పసుపులేటి మెహర్ సుజాత, వాడ్రేవు గాయత్రి ఆధ్వర్యాన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. వ్యాయామోపాధ్యాయులు నాగమణి, ప్రసాదరెడ్డి ఆధ్వర్యాన క్రీడా దినోత్సవం కూడా నిర్వహించారు. హసన్‌బాద జెడ్పీ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయిని పీఎస్‌బీఎస్‌కే సుందరి ఆధ్వర్యాన గిడుగు రామమూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు వ్యాస రచన, ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. భరతమాత, గిడుగు రామమూర్తి వేషధారణలో చిన్నారులు అలరించారు. నరసాపురపుపేట జెడ్పీ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయురాలు కేకేఎల్ కుమారి నేతృత్వంలో తెలుగు భాష, క్రీడా దినోత్సవాలు ఘనంగా నిర్వహించారు. భరతమాత, తెలుగు కవుల వేషధారణలో చిన్నారులు అలరించారు. తెలుగు భాష గొప్పదనంపై అవగాహన కల్పించేలా పాటలు పాడుతూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు పరమటి జ్ఞానలక్ష్మి, ఎం.స్వాతి, తెలుగు ఉపాధ్యాయులు జి.పద్మావతి, విజయకుమారి పాల్గొన్నారు.

కె.గంగవరం మండలంలో..

కె.గంగవరం: మండలంలోని పలు పాఠశాలల్లో తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సమావేశాల్లో తెలుగు భాషా పండితులు తెలుగు భాష ఔన్నత్యాన్ని విద్యార్థులకు వివరించారు. తెలుగు పద్య పోటీలు నిర్వహించి, విజేతలకు ఉపాధ్యాయులు బహుమతులు అందించారు. కె.గంగవరం ఉన్నత పాఠశాలలో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థుల వేషధారణలు, నాటికలు, భరత నాట్యం అలరించాయి. వారికి వ్యాసరచన, చిత్రలేఖనం వంటి పోటీలు నిర్వహించారు. హెచ్‌ఎం వెంకటేశ్వరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గిడుగు రామ్మూర్తి కృషి ఎనలేనిది



సోమేశ్వరంలో విద్యార్థులకు అందజేసిన బహుమతులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

రాయవరం: తెలుగు భాషకు గిడుగు రామ్మూర్తి పంతులు చేసిన కృషి ఎనలేనిదని డీవైఈవో పి.షాలెంరాజు అన్నారు. సోమేశ్వరం జెడ్పీ హైస్కూలులో నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. హెచ్‌ఎం దయామణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గిడుగు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివిధ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. రాయవరం రామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం వి.శాంతి సునీత ఆధ్వర్యంలో తెలుగుభాషా దినోత్సవం, క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. యోగా గు రువు వెలగల ఫణీకృష్ణారెడ్డి సౌజన్యంతో పాఠశాల్లో నిర్వహించిన దస్తూరి, పద్యధారణ, వ్యాసరచన పోటీల్లో విజేతలైన విద్యార్థుల కు బహుమతులు అందజేశారు. పూర్వ విద్యార్థి తెంటు సత్యనారాయణ, డీఎన్ సుధాకర్ పాల్గొన్నా రు.

మండపేట: మండలంలోని ఏడిద జెడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగుభాష, క్రీడా దినోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం ముంగర వెంకట్రాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాట్లాడుతూ, తెలుగుభాష ఔన్నత్యానికి జరిగిన కృషిని వివరించారు. అలాగే ధ్యాన్‌చంద్ నుంచి నీరజ్ చోప్రా వరకూ క్రీడాకారులు దేశానికి అందించిన ఒలింపిక్స్ పతకాల గురించి వివరించారు. నాటి రాష్ట్రస్థాయి క్రీడాకారులైన ఉపాధ్యాయులు సావిత్రి, చిక్కాల నవీన్‌కుమార్‌లను సత్కరించారు.

తెలుగు వైభవాన్ని కాపాడుకోవాలి

కపిలేశ్వరపురం: మాచర ప్రభుత్వ జూనియర్ కళాశాల, జెడ్పీ హైస్కూలులో విద్యార్థులు తెలుగుతల్లి, నన్నయ్య, ఎర్రన, పోతన, తిక్కన తదితర భాషా కోవిదుల వేషధారణలో అలరించారు. హెచ్‌ఎం రమాదేవి, తెలుగు అధ్యాపకులు పూజ్యం షిర్డీ సాయి పురుషోత్తం, సీనియర్ ఉపాధ్యాయులు వాడ్రేవు శ్రీనివాసరావు తదితరులు మాట్లాడుతూ, తెలుగు భాష ఔన్నత్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.